ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
MHR TV
మెదక్ సంపుటి : 18 సంచిక : 293 గురువారం, జూన్ 19, 2025 పేజీలు:4 వెల: 1 రూ/
Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam

# గూగుల్ ఒక వినూత్న సంస్థ

## - గూగుల్ సేఫ్టీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి
- నైపుణ్యాభివృద్ధికి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి



**హైదరాబాద్** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రారంభించారు. ఇది భారతదేశంలో మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో టోక్యో తర్వాత రెండవ సెంటర్ కావడం విశేషం. ఈ సేఫ్టీ సెంటర్ సైబర్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ భద్రత, ఏఐ-ఆధారిత భద్రతా పరిష్కారాలపై పరిశోధన చేస్తుంది. ఇది తెలంగాణ, భారతదేశ డిజిటల్ భద్రతను పెంపొందించడంతోపాటు, వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి ఈ ప్రాజెక్ట్‌ను హైదరాబాద్‌కు తేవడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కేంద్రం భారతదేశానికి సంబంధించిన సైబర్ సెక్యూరిటీ సవాళ్లకు పరిష్కారాలను అందిస్తుంది. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి భద్రతా హబ్‌గా తీర్చిదిద్దుతుందని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తోంది. రేవంత్ రెడ్డి గూగుల్‌తో ఈ భాగస్వామ్యం తెలంగాణ యువతకు, ఇంజనీర్‌లకు, భద్రతా నిపుణులకు విశేష అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. ఈ కేంద్రం సైబర్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ భద్రత, %ూ×%-ఆధారిత భద్రతా పరిష్కారాలపై పరిశోధన చేస్తుంది. ఇది భారతదేశం, తెలంగాణకు అవసరమైన సైబర్ భద్రతా సవాళ్లకు పరిష్కారాలను అందిస్తుంది. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి భద్రతా హబ్‌గా మార్చడంలో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కేంద్రం వల్ల యువతకు, ఇంజనీర్‌లకు, భద్రతా నిపుణులకు వేలాది ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి. తెలంగాణ రాష్ట్రంలో డిజిటల్ భద్రత, సాంకేతిక వికాసం, ఇన్నోవేషన్‌లను పెంపొందిస్తుంది. గూగుల్‌తో భాగస్వామ్యం వల్ల తెలంగాణకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం మరియు మార్కెట్ ఎక్స్పోజర్ లభిస్తుంది. గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయింది. నేడు, మన జీవితాలు పూర్తిగా డిజిటల్ మారాయి. మనం గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నాం. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్ గా మారాయి. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతాం. అధునాతన సైబర్ సెక్యూరిటీ , భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్-సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇది నైపుణ్య అభివృద్ధి పై దృష్టి పెడుతుంది. ఉపాధిని సృష్టించడం తో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుంది. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతం ఈ విధానాన్ని నేను ఇష్టపడుతున్నాను.గూగుల్ లాగా, నా ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నాను. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయి, అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టి పెట్టి పని చేయాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుంది. మీకు సెర్చ్ లో మొదటి లింక్ హైదరాబాద్ వస్తుంది. దీనిని మేము తెలంగాణ రైజింగ్ అని పిలుస్తాము. 2035 నాటికి తెలంగాణను

2లో..

## డబుల్ గేమ్ వద్దు..

# ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం తప్పదు

### - ఆ దేశాలకు మోదీ వార్నింగ్



**న్యూఢిల్లీ** ప్రపంచ ఆర్థిక శక్తివంతమైన దేశాల కూటమి జీ-7 సదస్సులో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలన్నీ ఏకమై పోరాడాలని ఈ విషయంలో అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని తక్షణమే విడనాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశాలను జవాబుదారీగా చేయాలని ప్రధాని మోదీ జీ-7 ఔట్‌రీచ్ సెషన్‌లో స్పష్టం చేశారు. ఉగ్రవాదం ప్రపంచ శాంతికి, స్థిరత్వానికి అతి పెద్ద ముప్పుగా పరిణమించిందని మోదీ తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా ఉపయోగిస్తున్నాయని, ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. "ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశాలను కొన్నిసార్లు బహుమతులతో సత్కరిస్తున్న తీరును మనం చూస్తున్నాము. ఇది అంతర్జాతీయంగా ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోంది. దీన్ని మనం అంతం చేయాలి" అని మోదీ ఉద్ఘాటించారు. గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలను జీ-7 మరింత సీరియస్‌గా పరిగణనలోకి తీసుకోవాలని కూడా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు, సవాళ్లను జీ-7 దేశాలు అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి ముందుకు రావాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. అలాగే ఈ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ పలు దేశాధినేతలతో ఫలవంతమైన చర్చలు జరిపారు. ముఖ్యంగా కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్, ఇటాలియన్ ప్రధాని జార్జియా మెలోని, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్‌లతో కూడా సమావేశం అయ్యారు. వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడం, ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి కలిసి పని చేయడం వంటి అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా భారత్-కెనడా మధ్య సంబంధాల సాధారణీకరణకు కృషి చేస్తూ దౌత్య, వాణిజ్య సేవలను మెరుగు పరిచేందుకు కొత్త హైకమిషనర్లను నియమించడానికి రెండు దేశాలు అంగీకరించాయి. ఇది ఇరు దేశాల మధ్య ఇటీవలి కాలంలో నెలకొన్న ఉద్రిక్తతలను

2లో..

# నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

### - ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు




**న్యూయార్క్** ఇరాన్ వ్యవహారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఇప్పటికే హద్దులు మీరి ప్రవర్తించిందని, దానిపై స్పందించడంలో చాలా జాప్యం జరిగిందని ఆయన అన్నారు. ఇజ్రాయెల్‌తో ఇరాన్‌కు కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, ఈ వివాదంలో అమెరికా జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఇరాన్‌పై లేదా ఆ దేశ అణు కేంద్రాలపై దాడులు చేసే ఆలోచన అమెరికాకు ఉందా అనే విషయాన్ని స్పష్టం చేయడానికి ట్రంప్ నిరాకరించారు. అయితే, టెహ్రాన్ తన పరిమితులను అతిక్రమించిందని, దీనిపై చర్యలు తీసుకోవడం ఇప్పటికే ఆలస్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే వారంలో లేదా అంతకంటే ముందుగానే చాలా కీలకమైన పరిణామాలు చోటుచేసుకోవచ్చని ఆయన సూచనప్రాయంగా తెలిపారు."వారం క్రితం ఉన్న పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో నేను జోక్యం చేసుకుంటానో లేదో చెప్పలేను. నేను ఏం చేయబోతున్నానో ఎవరికీ తెలియదు" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో చర్చలు జరిపేందుకు ఇరాన్ ప్రతిపాదన చేసిందని చెబుతూనే, ఆ చర్చలు ఎప్పుడు, ఏ విధంగా జరుగుతాయనే వివరాలను వెల్లడించలేదు. ప్రస్తుతం టెహ్రాన్ తనను తాను రక్షించుకోలేని స్థితిలో ఉందని, ఆ దేశం వద్ద సరైన గగనతల రక్షణ వ్యవస్థలు కూడా లేవని ట్రంప్ వ్యాఖ్యానించారు.

2లో..

# దేశంలో మళ్లీ కరోనా అలజడి

### - నాలుగు కొత్త ఒమిక్రాన్ సబ్ వేరియంట్లు గుర్తింపు



**న్యూఢిల్లీ** దేశవ్యాప్తంగా ఇటీవల కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ తాజా కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు కొత్త ఉపరకాలే (సబ్ వేరియంట్లు) కారణమని పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) నిర్ధారించింది. జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా ఈ కొత్త ఉపరకాలను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ పరిశోధన ఫలితాలు వ్యాక్సిన్‌ల సామర్థ్యాన్ని

2లో..

# రైతుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

- తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు చెబుతోందన్న సీఎం రేవంత్
- తమ ప్రాజెక్టులకు ఎన్‌ఓసీ ఇస్తే, ఏపీకి ఎలాంటి అభ్యంతరం చెప్పబోమన్న సీఎం
- గోదావరి-బనకచర్లపై కేసీఆర్, జగన్ 2019లోనే చర్చించారన్న రేవంత్
- కేసీఆర్ చేసిన సంతకమే తెలంగాణకు ప్రతిబంధకమన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్** తెలంగాణలోని పలు సాగునీటి ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీలు) జారీ చేస్తే, ఏపీ ప్రాజెక్టులపై తాము కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పబోమని ఆయన స్పష్టం చేశారు. "నేను పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచన చేస్తున్నాను. కేంద్రంలో మీకు పలుకుబడి ఉండవచ్చు మీరేం చెబితే మోదీ గారు అది వినవచ్చు. అలా అని ప్రాజెక్టులన్నింటికీ అనుమతి వస్తుందని అనుకుంటే అది భ్రమ. అలాంటి వాటికి అవకాశం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో అవసరమైన ప్రణాళిక, వ్యూహరచన మా వద్ద ఉంది. మేము వివిధ రాజ్యాంగబద్ధమైన సంస్థలకు ఫిర్యాదు చేస్తున్నాం. అక్కడ మాకు న్యాయం జరగకుంటే న్యాయస్థానాలకు వెళతాం, అక్కడి నుంచి ప్రజల వద్దకు వెళతాం" అని ఆయన అన్నారు. బుధవారం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు.

2లో..

## హైదరాబాద్ లో ఇల్లు, ఫ్లాట్

# కొనే వారికి హైడ్రా హెచ్చరిక

### - వివరాలన్నీ చెక్ చేసి కొనుక్కోవాలని సూచన



**హైదరాబాద్** హైదరాబాద్.. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో ఒకటి. ప్రపంచంలోని మహా నగరాల్లో 41వ స్థానంలో ఉంది. రోజురోజుకీ హైదరాబాద్ నగరం విస్తరిస్తూ ఉంది. అటు ఐటీ, ఫార్మా, టెక్ రంగాల్లో రాష్ట్ర రాజధాని దూసుకెళ్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ లో ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగం కూడా క్రమంగా పుంజుకుంటున్న నేపథ్యంలో హైదరాబాద్ లో భారీగా ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు జరుగుతోంది. ఈ క్రమంలో హైడ్రా కీలక సూచనలు చేసింది. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో ఒకటైన హైదరాబాద్ లో ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు ఊపందుకుంటుంది. ఈ క్రమంలో హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన ఆస్తి రక్షణ అథారిటీ (హైడ్రా) కీలక సూచనలు చేసింది. హైదరాబాద్ నగరంలో ఏదైనా ఇల్లు, ప్లాట్లు ఏదైనా ఆస్తి కొనుగోలు చేసే ముందు వివరాలను పూర్తిగా ధృవీకరించుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచనలు చేశారు.హైదరాబాద్ లో ఇళ్లు, ప్లాట్ల కొనుగోలుదారులు నగరంలో ఏదైనా ఆస్తిని కొనుగోలు చేసే ముందు వివరాలను ధృవీకరించాలన్నారు. హైదరాబాద్ లో ఆక్రమణలకు గురైన భూమిలో ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇళ్లు కూల్చివేతను ఎదుర్కోవాల్సి ఉంటుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఆక్రమణకు గురైన నాలాపై నిర్మించిందా.? లేదా.? అనే దానితో సహా ఆస్తి వివరాలను ధృవీకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల ఆధారంగా అలాంటి ఆస్తులను కూల్చి వేస్తామని ఆయన తెలిపారు. మరోవైపు హైదరాబాద్ లో నాలాల ఆక్రమణలకు సంబంధించి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 47 పిటిషన్లు వచ్చాయని హైడ్రా ఓ ప్రకటనలో పేర్కొంది. భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రమాదాలను తగ్గించడానికి రానున్న రోజుల్లో పూడిక తొలగింపు, ఆక్రమణల నిరోధక కార్యకలాపాలు వేగవంతం కానున్నట్లు స్పష్టం చేసింది.

## కూటమి గెలిచాక వారిని

# ఊరు విడిచి వెళ్లిపోమన్నారు

### - పల్నాడు జిల్లాలో జగన్ తీవ్ర ఆరోపణలు

- పల్నాడు జిల్లా రెంటపాళ్లలో మాజీ సీఎం జగన్ పర్యటన
- ఆత్మహత్య చేసుకున్న ఉపసర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబానికి పరామర్శ
- ఏపీలో అభివృద్ధి, సంక్షేమం లేవని, 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని విమర్శ
- నాగమల్లేశ్వరరావును బెదిరించిన సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**పల్నాడు** రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, రెంటపాళ్ల గ్రామానికి చెందిన కోర్లకుంట వెంకటేశ్వరరావు కుటుంబానికి జరిగిన అన్యాయమే దీనికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన రెంటపాళ్లలో పర్యటించి, ఆత్మహత్యకు పాల్పడిన నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు.గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజున రెంటపాళ్ల ఉపసర్పంచ్‌గా ఉన్న నాగమల్లేశ్వరరావుపై తెలుగుదేశం, జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు చేశారని జగన్ ఆరోపించారు. ఆ ఆరోపణలతో పోలీసులు ఆయనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా అవమానించారని అన్నారు. ఎన్నికల్లో కూటమికి అనుకూల ఫలితాలు వచ్చిన తర్వాత నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడులు చేసి, ఊరు విడిచి వెళ్లిపోవాలని, లేకపోతే రౌడీ షీట్ తెరుస్తామని స్వయంగా సీఐ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు."జూన్ 5వ తేదీ రాత్రి పోలీసులు నాగమల్లేశ్వరరావును వదిలిపెట్టగా, ఆయన నేరుగా గుంటూరులోని తన సోదరుడి ఇంటికి వెళ్లారు.

2లో..

# సింగయ్య మృతిపై విచారణ

**గుంటూరు** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సత్తెనపల్లి వెళ్తుండగా ఏటుకూరు బైపాస్ వద్ద కాన్వాయ్ ముందు వెళ్తున్న ప్రైవేటు వాహనం ఢీకొని చీలి సింగయ్య ప్రమాదానికి గురయ్యారని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం వెంగళయపాలెంకు చెందిన సింగయ్య జగన్ పర్యటనను చూసేందుకు ఏటుకూరు బైపాస్ వద్దకు వచ్చారు.జగన్ కాన్వాయ్ వచ్చిన సమయంలో ఎదురుగా ఉన్న ప్రైవేటు వాహనం సింగయ్యని ఢీ కొట్టింది దీంతో సింగయ్య రోడ్డుపై పడిపోయాడు. అతనిని అక్కడి వారు పక్కనే ఉన్న డివైడర్పై పడుకోబెట్టి వెళ్లిపోయారు. హైవే పోలీసులు అతనిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీనిపై విచారణ జరుగుతుందని అలానే ఎవరైనా ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు

# సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం

**తిరుపతి** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని,సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ యంత్రపరికరాలు, డ్రోన్లు అందిస్తున్నామన్నారు తిరుపతి వెంకటేశ్వర్.జిల్లాలోని 1678 చిన్న సన్న కారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరములను రాయితీపై రూ 2,67,26,984/-లు చెక్కును వ్యవసాయ అదికారి ప్రసాద్ తో కలసి పంపిణి చేసి రైతులతో సమీక్షా సమవేశం నిర్వహించారు.స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు వ్యవసాయ శాఖదికారులతో కలసి రాష్ట్ర ప్రభుత్వం రైతులను, వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని, సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ యంత్రపరికరాలు, డ్రోన్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలోని 1678 చిన్న సన్న కారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరములను రాయితీపై రూ 2,67,26,984/-లు చెక్కును జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ వ్యవసాయ శాఖ అదికారితో కలసి పంపిణి చేసి రైతులతో సమీక్షా సమవేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం మీద వ్యవసాయ శాఖ మీద ప్రత్యేక దృష్టి పెడుతుందని , దానిలో బాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సాంకేతిక పరిజ్ఞానంతో ముందు చూపుతో వెళ్తున్నారని తెలిపారు . గతంలో 2018-19 ముందు రైతులకు యంత్రపరికరాలను సబ్సిడీపై అందించారని తెలిపారు. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ కు ముందుగానే మన జిల్లాలో 1678 చిన్న సన్న కారు రైతులకు సుమారుగా 6 కోట్లు విలువగల వ్యవసాయ యంత్ర పరికరములను అందించడం జరిగిందన్నారు . అందులో రాయితీ కింద రూ 2,67,26,984/-లు రైతులకు అందిస్తున్నామన్నారు. అలగే మీ ద్వారా కూడా సూచనలను సలహాలను తీసుకోవడం జరిగిందన్నారు.

# యోగా డేను విజయవంతం చేయాలి

**విశాఖపట్నం** విశాఖలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు: ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూసేలా నిర్వహిస్తున్న యోగా వేడుకలో అందరూ పాల్గొనాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. ప్రపంచ యోగా దినోత్సవానికి విశాఖలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రవాణా, ఆహార సౌకర్యాలు ప్రణాళిక ప్రకారం సిద్ధం చేస్తున్నామని తెలిపారు.ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అలానే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విశాఖ ఒక గ్లోబల్ ఈవెంట్ కి వేదిక అయిందని,దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని రెవెన్యూ మినిస్టర్ అనగాని సత్య ప్రసాద్ తెలిపారు.యోగ డే తో విశాఖ కి ప్రపంచ గుర్తింపు వస్తుందని,వెల్త్, హెల్త్, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ కాన్సెప్ట్ తో రాష్ట్ర ప్రభుత్వం యోగా ఆంధ్రా నిర్వహించబోతుందని,5 లక్షల మంది ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని చెప్పారు.దానికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వెల్లడించారు.

# నీతి వ్యాఖ్యలు వల్లిస్తున్న కేటీఆర్..
# తిట్టుకుంటున్న ముసలివాళ్ళు

**- ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమ్మార్**

**హైదరాబాద్** నీతి వ్యాఖ్యలు వల్లిస్తున్న కేటీఆర్ ను చూసి భార్య భర్తల ఫోన్లు ఎలా వింటాడని కేటీఆర్ ను 65 ఏండ్ల ముసలివాళ్ళు తిడుతున్నారని ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ విమర్శించారు. బుదవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పరువు బజారున పడేసినందుకు కల్వకుంట్ల కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేవ్వారు.కేటీఆర్ నోరు తెరిస్తే అబద్ధమే మాట్లాడుతాడని,బీఆర్ఎస్ పార్టీ అనేది గతంరేవంత్ రెడ్డి అరగంట బీఆర్ఎస్ గురించి ఆలోచిస్తే ఆ పార్టీలో నలుగురు తప్పా ఎవరూ ఉండరన్నారు.కేటీఆర్ కి ఇంగ్లీష్ ఫుల్... సబ్జెక్టు నిల్ కల్వకుంట్ల కుటుంబం రేవంత్ పేరును కోటి సార్లు పలికి ఉంటారు కల్వకుంట్ల కుటుంబం కల్వ కుట్రల కుటుంబం కేటీఆర్ చీప్ గా చిల్లరగా మాట్లాడుతాని ఎద్దేవా చేసారు.

# నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఎదగాలి.





**జగిత్యాల** విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానం సాధించాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి అన్నారు. వాల్మీకి ఆవాసం సేవా భారతి ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యశస్వి ఎంటర్ప్రైజెస్ అధినేత కోటగిరి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రంగు గోపాల్ హాజరుకాగా ప్రధాన వక్తగా డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సేవా విభాగం సేవా భారతి ద్వారా దేశవ్యాప్తంగా 1,70,000 సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. వాల్మీకి ఆవాసం ద్వారా ఉచిత ట్యూషన్ సెంటర్లు, బాల సంస్కార కేంద్రాలు, కుట్టు శిక్షణ కేంద్రం తో పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు కల్పించడం ఏ ప్రభుత్వం వల్ల కూడా సాధ్యం కాదని యువత తమ నైపుణ్యాలను పెంచుకొని స్వయం ఉపాధి కోసం ప్రయత్నించాలన్నారు. మనదేశంలో నైపుణ్యం గల యువత ఎంతో మంది ఉన్నారని వారు తమ స్టార్టప్ ల ద్వారా వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. కంప్యూటర్ దశ దాటి ప్రస్తుతం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) యుగం నడుస్తుందని ఆ దిశగా యువత తమ నైపుణ్యాలకు మరింత పదును పెట్టి జీవితము లో ఎదగాలని సూచించారు. వాల్మీకి ఆవాసం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఆవాస ప్రధాన కార్యదర్శి నందెల్లి మదన్మోహన్ రావు, కమిటీ సభ్యులు అశోక్ రావు,బెజ్జంకి సంపూర్ణ చారి, ఎలగందుల కైలాసం, గౌరిశెట్టి హరీష్, శిక్షణ కేంద్రం ఇంచార్జ్ సత్యం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పాలనలో మెడికల్ కళాశాలల
# భవిష్యత్ గందరగోళం

- పాలన వదిలేసి ప్రతీకార చర్యలతోనే ఈ దుస్థితి.
- ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలి.
- జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత



**జగిత్యాల :** జగిత్యాల మెడికల్ కాలేజీలో మౌలిక వసతులు లేక జాతీయ వైద్య మండలి నోటీసులు జారీ చేయాదంతోనే రాష్ట్రంలోని మెడికల్ కళాశాల ల పరిస్థితి గందరగోళంగా మారిందని తాజా మాజీ జడ్పి చైర్మన్ దావ వసంత అన్నారు. జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూబిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ప్రారంభించిన ప్రభుత్వం మెడికల్ కాలేజీల భవితవ్యం రేవంత్ రెడ్డి పాలనలో ప్రశ్నార్థకంగా మారిందనీ అన్నారు. జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజ్ కు నోటీసులు రావడం సిగ్గుచేటు అని అన్నారు. జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీ తో పాటు 26 మెడికల్ కాలేజీల్లో నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు వసతులు లేకపోవడంపై ఈ నెల 18 న ఎన్. ఎమ్. సి ముందు ప్రత్యక్షంగా హాజరుకావాలని హెల్త్ సెక్రటరీ, డీఎంఈ కి నోటీసులు ఇవ్వడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనం అని అన్నారు. 2014లో స్వరాష్ట్రం ఏర్పడ్డ నాటికి తెలంగాణలో ఐదు ప్రభుత్వ ,15 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు వాటిలో 2850 ఎంబిబిఎస్ సీట్లు మాత్రమే ఉండేవి అని అన్నారు తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కో జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో 2023 అక్టోబర్ నాటికి మొత్తం కళాశాలల సంఖ్య 56 సీట్ల సంఖ్య 8340 కి చేరింది అప్పటికి కెసిఆర్ ప్రభుత్వం మరో 8 మెడికల్ కాలేజ్లు మంజూరు చేయడంతో మొత్తం సీట్ల సంఖ్య 9140 కి చేరిందన్నారు. కానీ కెసిఆర్ సంకల్పానికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పోడుస్తుందని అన్నారు. వైద్య కళాశాలలో కనీసం వసతులు కల్పించలేని దుస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని అన్నారు.కెసిఆర్ నాయకత్వంలో మొదటి జగిత్యాల మెడికల్ కాలేజ్ కు పెర్మిషన్ వచ్చింది ఇవాళ కనీసం కనీస అవసరాలు లేని దుస్థితి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లోఎందుకు వచ్చింది ఇప్పుడు ఉన్న నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదు అని ప్రశ్నించారు. అప్పట్లో జగిత్యాల జిల్లాకు మెడికల్ కాలేజీ వస్తదా అని అన్న నాయకులు కేసీఆర్ సారథ్యంలో కల్వకుంట్ల కవితక్క కృషి తో జగిత్యాల జిల్లాకు మెడికల్ కాలేజీనీ సాధించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు హయాంలో మెడికల్ కాలేజీకు అన్ని అనుమతులు సాధించుకున్నామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలైనా కూడా కేసీఆర్ గారిని విమర్శిస్తూనే ఉన్నారు కానీ పాలన మీద దృష్టి సాదించడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి ప్రతికార రాజకీయాలు చేస్తున్నారని ఇప్పటికైనా కళ్ళు తెరిచి జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీకి కావలసిన నిధులు విడుదల చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి ఎన్. ఎమ్. సి నిబంధనలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థి జీవితాలను నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహేష్, మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రావు, రిజ్వాన్, అనురాధ, బాలే చందు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలపై వచ్చిన
# ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి

**జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**



**జగిత్యాల :** :రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు.శుక్రవారం మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసే పరిష్కరించాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు.ఆంతకుముందు మేడిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సంధర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడారు పాఠ్యాంశం బోధన (ఐఎఫ్పీ) ఇంటర్ యాక్ట్ ఫ్లాంట్ ప్యానల్ ద్వారా విద్యార్థులకు బోధించేటప్పుడు తరగతి గదిలో విద్యార్థులతో కూర్చొని జిల్లా కలెక్టర్ విద్యా బోధన ను గమనించారు .పాఠశాల విషయాల గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకున్నారు.వంటగది సామాగ్రి పప్పు దినుసులు వంట నూనె సంబంధించినవి నాణ్యత పరిమాణాలతో ఉండాలని, పిల్లలకు మంచి భోజనం అందించాలి సూచించారు.. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నీరు నిలువ ఉండకుండా చూడాలని ఎప్పటికప్పుడు శు భ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఈవో రామ్, కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి,తహసిల్దార్ మునీందర్,ఎంపీడీవో పద్మావతి,సంబంధిత అధికారులు, రైతులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అనువంశిక రక్తరుగ్మత 'సికిల్ సెల్ అనీమియా'

తల్లితండ్రుల నుంచి సంక్రమించే జన్యులోప రుగ్మతగా "సికిల్ సెల్ రక్తహీనత" ప్రమాదకరంగా మారుతోంది. శరీర కణజాలానికి ప్రాణవాయువు, ఆక్సీజన్‌ను అందించే రక్తంలోని ఎర్ర రక్త కణాలతో కూడిన హీమోగ్లోబిన్ ఉపకరిస్తుంది. ఆక్సీజన్‌ను సరఫరా చేస్తున్న ఎర్ర రక్త కణాలు గుండ్రంగా, మృదువుగా, ఫ్లెక్సిబుల్‌గా ఉంటూ రక్త నాళాల గుండా సులభంగా ప్రవహిస్తూ, మన ఆరోగ్యానికి పునాదులు వేస్తున్నాయి. సికిల్ సెల్ రుగ్మత బారిన పడిన వ్యక్తుల ఎర్ర రక్త కణాలు దృఢంగా, గట్టిగా, అంటుకునే గుణంతో, సి-ఆకారంలో కొడవలి లేదా సికిల్ ఆకారంలో ఉంటాయి. ఆ సికిల్ కణాలు రక్తనాళాల్లో సులభంగా ప్రవహించకుండా, త్వరగా చనిపోతూ ఉంటాయి. ఇలాంటి సికిల్ సెల్ రుగ్మత ఉన్న వారిలో దీర్ఘకాలిక రక్తహీనత, నొప్పులు, అవయవాలకు హాని, ఇతర తీవ్రమైన అనారోగ్యాలను కలిగిస్తుంది. దీనినే సికిల్ సెల్ రుగ్మతగా పిలవడం జరుగుతోంది. సికిల్ సెల్ రక్త రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షలతో గుర్తించడం, వ్యాధిగ్రస్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, రోగుల కుటుంబాల్లో ఆత్మ విశ్వాసం పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఐరాస ఆమోదంతో ప్రతి ఏట 19 జూన్ రోజున "ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం (వరల్డ్ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది.

## మొదటి పేజీ తరువాయి

# గూగుల్ ఒక వినూత్న సంస్థ

1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. మేము 1 కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనుకుంటున్నాం. గూగుల్ ఆఫీస్ పక్క ని రెండున్నర ఎకరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళ ల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశా మేము మా రైతులను సంపన్నులుగా తయారు చేయడంతో పాటు సంతోషంగా ఉంచాలనుకుంటున్నాం. మా యువతలో నైపుణ్యాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి కల్పించాలనుకుంటున్నాం. వీటన్నిటికీ, నాకు మీ మద్దతు అవసరం. తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా కావాలని కోరుకుంటున్న.గూగుల్ , హైదరాబాద్ పాత స్నేహితులు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసింది. దాదాపు 7,000 మంది గూగుల్ ఉద్యోగులు నేడు హైదరాబాద్‌ను తమ ఇల్లుగా భావిస్తున్నారు. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం ఇలా అనేక రంగాలలో గూగుల్ తో కలిసి మేం పనిచేస్తున్నాం. గూగుల్ ఒక వినూత్న సంస్థ, మాది ఒక వినూత్న ప్రభుత్వం. మా ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించాం. జీహెచ్ఎంసీ కూడా వివిధ పనుల కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమిస్తుంది.నాణ్యమైన విద్య మా లక్ష్యం ఇందుకోసం యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను తీసుకువస్తున్నాం. తెలంగాణ లో ప్రతి సంవత్సరం 1.10 లక్షల ఇంజనీర్స్ కాలేజ్ ల నుంచి వస్తున్నారు. చాలా మంది విద్యార్థులకు నైపుణ్యం ఉండడం లేదు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యం లో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నా అందరికీ ఆరోగ్యం మా లక్ష్యం. ఇవే నా ప్రధాన ఆవిష్కరణలు, గూగుల్ లాగానే, నా ప్రభుత్వంలో భాగస్వాములైన మహిళలు, యువత, రైతులు, పేదలు, మధ్యతరగతి, సీనియర్ సిటిజన్లు, పిల్లలకు ఉన్నతమైన జీవన ప్రమాణాలు కల్పించాలని కోరుకుంటున్నాం. హైదరాబాద్ లో మీ కొత్త సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు మరోసారి అభినందిస్తున్నాను. మేం గర్వపడేలా మీరు పనిచేస్తారని నమ్మకం ఉందన్నారు' సీఎం రేవంత్ రెడ్డి.

# డబుల్ గేమ్ వద్దు..
## ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం తప్పదు

పడుతుందని అంతా భావిస్తున్నారు. ప్రధాని మోదీ ప్రసంగం జీ-7 దేశాలపై ఉగ్రవాదంపై మరింత కఠినంగా వ్యవహరించాలనే ఒత్తిడిని పెంచింది. మరోవైపు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దీనిపై స్పందించారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు కూడా పెట్టారు. అందులోనే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ వైఖరిని ప్రధానమంత్రి వివరించారని అన్నారు. భయంకరమైన పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు. అలాగే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ చర్యను వేగవంతం చేయాలని వివరించినట్లు వెల్లడించారు.

# నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

ఇరాన్ అగ్రనాయకత్వం గురించి అడిగిన ప్రశ్నకు, 'గుడ్‌లక్' అంటూ ట్రంప్ బదులిచ్చారు. టెహ్రాన్ విషయంలో తన యంత్రాంగానికి ఓపిక నశించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోవడంపై స్థానికంగా వ్యక్తమవుతున్న ఆందోళనల గురించి మాట్లాడుతూ, సుదీర్ఘకాలం యుద్ధం చేయాలనే కోరిక తమకు లేదని అన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్నదే తన ప్రధాన ఉద్దేశమని ఆయన పునరుద్ఘాటించారు.

మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఉద్దేశించి అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని, ఆయన సురక్షితంగానే ఉన్నారని ట్రంప్ అన్నారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను అంతమొందించాలనే ఆలోచన లేదని, ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేకపోతే పరిస్థితులు మరింత తీవ్రంగా మారతాయని హెచ్చరించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై సుప్రీం లీడర్ ఖమేనీ తీవ్రంగా ప్రతిస్పందించారు. లొంగిపోయే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఒకవేళ అమెరికా సైన్యం ఈ విషయంలో జోక్యం చేసుకుంటే, దాని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# దేశంలో మళ్లీ కరోనా అలజడి

అంచనా వేయడంలో ఉపయోగపడతాయని వారు తెలిపారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న కరోనా కేసుల నమూనాలను విశ్లేషించినప్పుడు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు ఉపరకాలు వెలుగులోకి వచ్చినట్లు ఎన్ఐవీ-పుణె డైరెక్టర్ డాక్టర్ నవీన్ కుమార్ వివరించారు. "మేము వీటిని ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్.1.16, ఎన్‌బీ.1.8.1 వేరియంట్లుగా గుర్తించాం. మొదట్లో జేఎన్.1.16 వేరియంట్ వల్ల కేసులు పెరిగినా, ఈ ఏడాది మే నెల నుంచి ఎక్స్ఎఫ్‌జీ వేరియంట్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఎల్ఎఫ్.7, ఎల్‌పీ.81.2 అనే రెండు వేరియంట్లు కలిసి ఎక్స్ఎఫ్‌జీగా రూపాంతరం చెందాయి" అని డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. కొత్త వేరియంట్లను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి జన్యుక్రమాన్ని విశ్లేషించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని ఆయన చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం నుంచి దేశంలో కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6,483 కొవిడ్-19 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు కరోనా కారణంగా 113 మంది మరణించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా కేరళలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉండగా, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాల్లో కూడా వైరస్ వ్యాప్తి అధికంగానే ఉంది. అయితే, ప్రస్తుతానికి ఇన్ఫెక్షన్ తీవ్రత తక్కువగానే ఉందని, బాధితులు ఎక్కువగా ఇళ్లలోనే ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వ్యాధి లక్షణాలు స్వల్పంగా ఉండటంతో ఆసుపత్రులలో చేరేవారి సంఖ్య తక్కువగానే ఉందని తెలుస్తోంది. అయినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రైతుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

2019 అక్టోబరులోనే అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించే విషయంపై చర్చించారని రేవంత్ రెడ్డి అన్నారు. "గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే ఒకరకంగా అంకురార్పణ జరిగింది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్లు నాడు 'నమస్తే తెలంగాణ' పత్రికలో కథనాలు కూడా వచ్చాయి" అని ఆయన తెలిపారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకు సాగాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని ఆయన పునరుద్ఘాటించారు.2016 సెప్టెంబర్ 21న కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ, ఏటా 3 వేల టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి పోతోందని అన్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "ఈ విషయంపై మొదట మాట్లాడిందే కేసీఆర్. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో రికార్డుల్లో స్పష్టంగా ఉంది. తెలంగాణకు కృష్ణా నది జలాల్లో 299 టీఎంసీలు సరిపోతాయని కూడా ఆనాడే కేసీఆర్ అంగీకరించి సంతకం చేశారు. ఆ సంతకమే ఇప్పుడు తెలంగాణకు గుదిబండగా మారింది" అని ఆయన విమర్శించారు. తెలంగాణకు 968 టీఎంసీల నీటిని వాడుకునేలా ప్రాజెక్టులకు ఏపీ ఎన్ఓసీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గోదావరి-బనకచర్ల ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటామని చెప్పారు. ఈ విషయంలో అన్ని పార్టీలను కలుపుకొని పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే కేసీఆర్ మాట్లాడారని ఆయన వివరణ ఇచ్చారు. కృష్ణా నదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే తమకు అభ్యంతరం లేదని మాత్రమే కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. ఈ సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందని ఆరోపించారు.

## కూటమి గెలిచాక వారినిఊరు విడిచి వెళ్లిపోమన్నారు

అక్కడి నుంచి తన తండ్రి వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి, పోలీసులు తనను బెదిరించిన తీరును వివరించారు. పోలీసుల వేధింపుల వల్లే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తండ్రి ఎంత ప్రయత్నించినా కుమారుడిని కాపాడుకోలేకపోయారు" అని జగన్ ఆవేదనగా చెప్పారు.రాష్ట్రంలో అభివృద్ధి గానీ, సంక్షేమం గానీ కనిపించడం లేదని, కేవలం 'రెడ్ బుక్ రాజ్యాంగం' మాత్రమే అమలవుతోందని జగన్ విమర్శించారు. "రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయనడానికి ఈ ఆంక్షలే నిదర్శనం. ఎన్నికల ఫలితాల సమయంలో తమకు అనుకూలమైన పోలీసు అధికారులను నియమించుకుని, కూటమిని గెలిపించుకోవడానికి అనేక అన్యాయాలకు పాల్పడ్డారు. ఈ విషయం ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసు" అని అన్నారు.నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆయన తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. "నాగమల్లేశ్వరరావును బెదిరించిన ఆ సీఐపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక

హైదరాబాద్ గురువారం 19, జూన్ 2025







# ప్రధాని మోదీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

**మనోహరాబాద్ (ప్రజాస్వరం)** మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ల ఆదేశానుసారం నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11సంవత్సరాల పాలన లోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకులు పురం మహేష్ ముదిరాజ్, మండల బీజేపీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ లు అన్నారు. మండలం లోని వెంకటాపూర్ అగ్రహారం గ్రామం లో మండల ఉపాధ్యక్షులు చెర్లపల్లి రాజేష్ గౌడ్, ఆంజనేయులు ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రచ్చ బండ కార్యక్రమం లో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధుల తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సీసీ రోడ్ల తో పాటు ప్రకృతి వనాలు, స్మశాన వాటికల నిర్మాణం, ఉపాధి హామీ రోడ్ల పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. రేషన్ బియ్యం ఒక్కొక్కరికి 5కిలోలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో కేంద్రం వాటా ఉందన్నారు. పాలన పై ఇంటిటా ప్రచారాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమం లో జిల్లా కౌన్సిల్ సభ్యులు కమ్మరి నరేంద్ర చారి, సీనియర్ నాయకులు పురం మహేష్ ముదిరాజ్ గారు, కొల్తూరి నరేష్ గౌడ్ గారు, కుంట మహేష్ గారు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటోళ్ల సాయి కిరణ్ గౌడ్ గారు, మండల ఉపాధ్యక్షులు, చాకలి మల్లేష్ గారు, మండల నాయకులు మామిండ్ల ప్రణయ్, చెట్టి రాజు ముదిరాజ్, ప్రవీణ్ చారి, నాగు ముదిరాజ్, వివేక్, సున్నం ప్రవీణ్, పంజా బిక్షపతి, రవి, సున్నం మల్లేష్, కురుమ మల్లేష్, దోమల పోచయ్య శంకరయ్య, కిష్టయ్య, చిన్న నర్సయ్య పాల్గొన్నారు

# ఘనంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి జన్మదిన వేడుకలు







**మెదక్ / మనోహరాబాద్ :** గ్రాడ్యుయేట్ బిజెపి ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఏడుపాయల అమ్మవారి ఆలయ ఆవరణలో జరిగిన వేడుకల్లో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల బీజేపీ పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్, గోదావరి అంజిరెడ్డి, బైరి శంకర్ ముదిరాజ్ లతోపాటు , రాష్ట్ర, జిల్లా పార్టీ ముఖ్య నాయకులు, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై ఎమ్మెల్సీ అంజి రెడ్డికి పుష్పగుచ్చాలు అందజేస్తూ శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ త్వరలో అన్ని మండలాల వారిగా పర్యటిస్తూ నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తనకు పుట్టినరోజు వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ ఆదేశాలకు లోబడి ప్రైవేటు పాఠశాలలు పనిచేయాలి.

**- మండల విద్యాధికారి పర్వతి సత్యనారాయణ.**



**తూప్రాన్ జూన్ 18( ప్రజా స్వరం ):** ప్రభుత్వ నిబంధలనలకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలలు పనిచేయలేని పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు స్టేషనరీ వస్తువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి పార్వతి సత్యనారాయణ అన్నారు. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలకు లోబడి పని చేయాలని, అందుకు వ్యతిరేకంగా వ్యవహరించిన పాఠశాలల పట్ల చర్యలు తీసుకొనుటకు ఉన్నతాధికారులకు తెలుపనున్నట్లు చెప్పారు. బుధవారం రోజున తూప్రాన్ మండల వనరుల కేంద్రంలో మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు తమ ఇష్టానుసారంగా వ్యవహరించకూడదని విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు ప్రభుత్వం సూచించిన సమయ పాలన పాటించాలని, ప్రైవేట్ పాఠశాలలు తరగతుల వారిగా విద్యార్థుల నుండి తీసుకుంటున్న ఫీజు వివరాలను కార్యాలయంలో సమర్పించాలన్నారు. విద్యార్థులకు డబుల్ ప్రమోషన్స్ ఇవ్వవద్దని ఎవరైనా చేసిన సరిదిద్దుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను విక్రయించడం చట్టరీత్యా నేరమని ఈ విషయంలో ప్రిన్సిపల్స్ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు శుద్ధి చేసిన త్రాగునీరు అందేలాగా చర్యలు తీసుకోవాలని, బాల బాలికలకు ప్రత్యేకమైన బాత్రూం సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. విద్యార్థులు డ్రాప్ బాక్స్ లో ఎవరు ఉండకుండా వారి పట్ల శ్రద్ధ తీసుకొని ప్రతి ఒక్కరూ పాఠశాలలో చదువుకునే విధంగా యాజమాన్యం, ప్రిన్సిపాల్ శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని మానసిక, శారీరక వికాసం సమపాళ్లలో ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని క్రీడల పట్ల ప్రైవేట్ పాఠశాలలు నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం సూచించిన విధంగా క్రీడా పీరియడ్స్ విద్యార్థులకు అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు ముందుగా వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలని సూచించారు. వాహనాలలో విద్యార్థులను గ్రామాల నుండి తీసుకొచ్చే సమయంలో వాహనాల యొక్క భద్రత,డ్రైవర్ల అనుభవం పరిగణలోనికి తీసుకొని, ప్రత్యేక రక్షణ చర్యలు విద్యార్థులకు కల్పించాలని సూచించారు సమావేశంలో మండల పరిధిలో గల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, మండల వనరుల కేంద్రం సిబ్బంది, సి.ఆర్.పి. లు పాల్గొన్నారు.

# జవాన్ మదురెడ్డికి బీజేపీ సన్మానం



**మెదక్ / శివంపేట (ప్రజాస్వరం)** ఆపరేషన్ సింధూర్ లో పాల్గొన్న మెదక్ జిల్లా శివంపేట్ మండలం పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన జవాన్ మధు రెడ్డి వారి స్వగృహానికి విచ్చేసిన సందర్భంగా వారిని మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆయనను అభినందించి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు బిక్షపతి , మండల నాయకులు నర్సారెడ్డి , ఆంజనేయులు , మాజీ సర్పంచ్ కాశ ఆంజనేయులు చారి, బూత్ అధ్యక్షులు బాల మల్లేష్, శంకర్ , శంకర్ , నరసింహులు , విట్టల్ నాయక్ , అశోక్ , పోచయ్య , వెంకటేష్ బీజేపీ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ వ్యవహారం..యువకుడి కిడ్నాప్ కేసులో

## తమిళనాడు ఏడీజీపీ సస్పెన్షన్.. సుప్రీంకోర్టు సీరియస్ కామెంట్స్

**న్యూ ఢిల్లీ** తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా కళంబాక్కంకు సంబంధించిన ఓ ప్రేమ వ్యవహారంలో యువకుడి కిడ్నాప్ తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు ఏడీజీపీ (ంఆఉఖ) జయరామ్ ను అరెస్టు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసింది.దీనిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఓ సీనియర్ పోలీసు అధికారి విచారణలో పాల్గొన్నందుకు ఆయనను ఎలా సస్పెండ్ చేస్తారంటూ తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. కళంబాక్కంకు చెందిన ఓ యువకుడు ఇటీవల తేనికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.కొన్ని రోజుల తర్వాత ఆ యువకుడి 16 ఏళ్ల సోదరుడు కిడ్నాప్ అయ్యాడు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో ఏడీజీపీ జయరామ్‌కు సంబంధం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి ఇటీవల విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు ఏడీజీపీని అరెస్టు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దాంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.ఈ క్రమంలో ఏడీజీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అరెస్టైన వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఏడీజీపీ హోదాలో ఉన్న తనను అరెస్టు చేశారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వ కౌన్సిల్ వాదనలు వినిపించారు.ఏడీజీపీని కస్టడీలోకి తీసుకుని విచారణ అనంతరం మంగళవారం సాయంత్రమే విడుదల చేశామని ఆయన సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే తనను పోలీసులు విడుదల చేసినప్పటికీ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిందని ఏడీజీపీ వాదించారు. దాంతో సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఆయనొక సీనియర్ పోలీసు అధికారి అని, ఆయయను సస్పెన్షన్‌లో పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది.ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఆశ్యర్యం కలిగించాయని వ్యాఖ్యానించింది. ఆ ఉత్తర్వులు నిరుత్సాహపరిచేలా ఉన్నాయని కోర్టు ఆగ్రహించింది. గురువారం నాటికి ఏడీజీపీపై సస్పెన్షన్‌ను రద్దు చేసి.. ఆ సమాచారాన్ని న్యాయస్థానానికి తెలియజేయాలని ఆదేశించింది.

# పోలీసులతో అంబటి వాగ్వాదం

**గుంటూరు** గుంటూరు జిల్లా సత్తెనపల్లి కంటేపూడి వద్ద వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు హడావుడి చేశారు. భారీ ర్యాలీతో వచ్చి, పోలీసుల బ్యారికేడ్లను తొలగించి వారితో వాగ్వాదానికి దిగారు. వాహనాలు ర్యాలీగా వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు తెలిపినప్పటికీ బ్యారికేడ్లను తొలగించి చొచ్చుకెళ్లేందుకు అంబటి రాంబాబు ప్రయత్నించారు.


# తమిళం కన్నా తెలుగు బేరాలు బాగున్నాయి



ఇంకో మూడు రోజుల్లో విడుదల కాబోతున్న కుబేర మీద అంచనాలు ఎగబాకుతున్నాయి. ఇటీవలే జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో రిలీజ్ చేసిన ట్రైలర్ సినిమా హైప్ విషయంలో బాగా ఉపయోగపడుతోంది. దర్శకుడు శేఖర్ కమ్ముల టిపికల్ స్టైల్ కనిపించినప్పటికీ ఆయన ఫాలో అయ్యే సాఫ్ట్ ఫార్ములా కాకుండా సీరియస్ జానర్ వైపు షిఫ్ట్ కావడం ఆసక్తి రేపుతోంది. అడ్వాన్స్ బుకింగ్స్ అప్పుడే ట్రెండింగ్ లోకి వచ్చేశాయి. బుక్ మై షో కదలికలు గమనిస్తే తమిళ వెర్షన్ కన్నా తెలుగు అమ్మకాలే వేగంగా ఉండటం గమనార్హం. హైదరాబాద్ ప్రముఖ మల్టీప్లెక్సుల్లో మొదటి రోజు షోలు దాదాపు ఫుల్ అవుతున్న వైనం కనిపిస్తోంది. దీనికి కారణాలు లేకపోలేదు. తమిళ ఆడియన్స్ కుబేరని తెలుగు సినిమాగానే చూస్తున్నారు. బై లింగ్వల్ అయినప్పటికీ శేఖర్ కమ్ముల, నాగార్జున, దేవిశ్రీ ప్రసాద్, రష్మిక మందన్న లాంటి పేర్లు ఆ ఫ్లేవర్ తీసుకొస్తున్నాయి. పైగా ట్రైలర్ సైతం మన నేటివిటీలోనే ఉందని వాళ్ళ ఫీలింగ్. గతంలో సార్ సైతం ఇదే తరహా స్పందన తెచ్చుకోవడం గుర్తు చేసుకోవచ్చు. ఇక్కడ బ్లాక్ బస్టర్ అయితే అక్కడ జస్ట్ హిట్ అనిపించుకుంది. కుబేర సైతం అదే కోవలోకి చేరొచ్చని ట్రేడ్ అంచనా.

రెండు మూడు వారాలుగా విపరీతమైన డ్రైతో ఉన్న టాలీవుడ్ బాక్సాఫీస్ కు ఊపిరి పోసే బాధ్యత ఇప్పుడు కుబేర మీదే ఉంది. కుబేరకు తమిళం కన్నా తెలుగులోనే బేరాలు బాగుండటం మంచి విషయమే. టాక్ కనక బాగా వస్తే కనీసం రెండు మూడు వారాలు స్ట్రాంగ్ గా నిలిచేందుకు అవకాశం దొరుకుతుంది. జూన్ 27 కన్నప్ప, జూలై 4 తమ్ముడు ఉన్నప్పటికీ కుబేర కనక యునానిమస్ అనిపించుకుంటే కాంపిటీషన్ పరంగా పెద్దగా టెన్షన్ ఉండదు.

# నవ వధువులు చనిపోయే 'విరాటపాలెం'



'రెక్కీ' లాంటి సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ వెబ్ సిరీస్ తరువాత 'విరాటపాలెం : పీసీ మీనా రిపోర్టింగ్' అనే ఓ ఉత్కంఠ రేపే వెబ్ సిరీస్‌తో మేకర్లు రాబోతోన్నారు. కృష్ణ పోలూరు దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా అలరించనుంది. అభిజ్ఞా వూతలూరు, చరణ్ లక్కరాజు నటించిన ఈ సిరీస్ ఈనెల 27న జీ5లో మాత్రమే ప్రీమియర్ కానుంది. 1980ల నాటి మారుమూల, భయానక గ్రామమైన విరాటపాలెం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరికి ఉన్న శాపం, ప్రతి వధువు తన పెళ్లి రోజున మరణించడం, దీంతో దశాబ్ద కాలంగా ఏ వివాహం జరగకపోవడం వంటి అంశాలతో కథ ముందుకు సాగుతుంది. అలా చివరకు పెళ్లిళ్లు అనేవి జరగకుండా గ్రామం భయంతో స్తంభించిపోతుంది. ఒక పోలీసు కానిస్టేబుల్ ఆ గ్రామానికి రావడం, అక్కడి శాపం గురించి తెలుసు కోవడం, ఆ రహస్యాన్ని ఛేదించడం అనే ఉత్కంఠ భరితమైన కథనంతో అందరినీ ఆకట్టుకునేలా ఈ సిరీస్ ఉండబోతోంది. జీ5 తెలుగు బిజినెస్ హెడ్ %-% అనురాధ గూడూర్ మాట్లాడుతూ, 'జీ5లో సాధారణ ప్రజలను ప్రతిబింబించే, వారికి కనెక్ట్ అయ్యే కథల్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఈ సిరీస్ కూడా ఉత్కంఠను కలిగిస్తూనే సామాజిక సందేశాన్ని కూడా అందిస్తుంది. భయం అనేది సమాజాన్ని ఎలా నియంత్రించగలదో, ధైర్యం అనేది దశాబ్దాల నిశ్శబ్దాన్ని ఎలా భంగపరచగలదో ఈ సిరీస్ చూపిస్తుంది' అని అన్నారు. ''రెక్కీ' తర్వాత, మరోసారి జీ5తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సిరీస్‌లో ఓ ఇంట్రెస్టింగ్ పాయింట్ ఉంటుంది. ప్రతి వధువు తన పెళ్లి రోజున మరణిస్తుంది. ఆ నమ్మకం భయంగా, భయం నిశ్శబ్దంగా మారిపోతుంది.

# సీక్వెల్స్ మంత్రం వద్దంటున్న ప్రభాస్




ఇప్పుడంతా సీక్వెల్స్ ట్రెండ్. ఒకప్పుడు టాలీవుడ్ లో పార్ట్ 2 అనే మాట ఉండేది కాదు. మనీతో రామ్ గోపాల్ వర్మ లాంటి నిర్మాతలు ఒకటి రెండు ప్రయత్నాలు చేసినా ఫలితాలు దక్కలేదు. కానీ బాహుబలి మొత్తం మార్చేసింది. కేవలం తెలుగులోనే కాదు అన్ని భాషల్లోనూ కొనసాగింపు జ్వరం అంటించింది. ఇది ఏ స్థాయిలో ఉందంటే రెండో భాగం కోసం సంవత్సరాల తరబడి ఖర్చు పెడుతున్న స్టార్ హీరోలు చాలా ఉన్నారు. కెజిఎఫ్ కోసం యష్ తీసుకున్న గ్యాప్ చిన్నది కాదు. పుష్ప సిరీస్ కోసం అల్లు అర్జున్ వెచ్చించిన సమయం అక్షరాలా అయిదు సంవత్సరాలు. అఫ్కోర్స్ దానికి తగ్గ గొప్ప ఫలితం అందుకోవడం వేరే విషయం. కానీ ప్రభాస్ మాత్రం సీక్వెల్స్ వెంటపడను అంటున్నాడు. ఇప్పటిదాకా సలార్ 2 శౌర్యంగపర్వం ఎప్పుడు మొదలవుతుందో ఎవరికీ తెలియదు. ఇతర నటీనటులు ఎగ్రిమెంట్ మెంట్ తో ఉన్నారు కానీ డార్లింగ్ మాత్రం కొత్త కథల వైపు మొగ్గు చూపుతున్నాడు. కల్కి 2 కోసం దర్శకుడు నాగ్ అశ్విన్ సిద్ధంగా ఉన్నా ఎప్పుడు స్టార్ట్ చేయాలనేది ప్రభాస్ డేట్స్ మీద ఆధారపడి ఉంటుంది. ది రాజా సాబ్ సింగల్ పార్ట్ ఉంటుందని, బలవంతంగా సీక్వెల్ రుద్దమని దర్శకుడు మారుతీ డైరెక్ట్ గా సంకేతం ఇచ్చాడు. ఫౌజీకి కంటిన్యూయేషన్ ఉండదు ప్రశాంత్ వర్మ తీయబోయే ప్యాన్ ఇండియా మూవీ, సందీప్ వంగా స్పిరిట్ సైతం సింగల్ పార్టని ఇన్ సైడ్ టాక్. ఏది ఏమైనా ప్రభాస్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అభిమానులు, ప్రేక్షకులు ఫ్రెష్ సబ్జెక్టుల్లో తమ హీరోని చూసుకుంటున్నారు. ఒకవేళ ఇవేవి కాకుండా కేవలం సలార్ 2నే స్టార్ట్ అయ్యుంటే ప్రశాంత్ నీల్ వర్కింగ్ స్టైల్ కి మిగిలినవి అసలు స్టార్ట్ అయ్యేవి కాదు.

# మళ్ళీ సైలెంట్ అయ్యిందేంటి




మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి తర్వాత గ్యాప్ తీసుకున్న అనుష్క కొత్త సినిమా ఘాటీ ఏప్రిల్ 18 నుంచి తప్పుకున్నాక కొత్త డేట్ జూలై 11 తీసుకుంది. ఇప్పుడు చేతిలో నెల రోజులు లేకపోయినా ఇంకా ప్రమోషన్లు మొదలు కాకపోవడం ఫ్యాన్స్ లో అనుమానాలు రేపుతోంది. అదే తేదీకి సుహాస్ ఓ భామ అయ్యో రామాని రిలీజ్ చేయడం చూస్తుంటే స్వీటీ మూవీ మళ్ళీ పోస్ట్ పోన్ అయిందేమోనని డౌట్ రావడం సహజం. యువి క్రియేషన్స్ బ్యానర్ పై క్రిష్ దర్శకత్వంలో రూపొందిన ఈ లేడీ గ్యాంగ్ స్టర్ డ్రామాలో అనుష్క గంజాయి డాన్ గా నటిస్తోంది. ఇప్పటిదాకా ఇంట్రో టీజర్ తప్ప ఎలాంటి ప్రమోషన్ కంటెంట్ వదల్లేదు. ఈ మౌనం వెనుక కొన్ని పరిణామాలు కనిపిస్తున్నాయి. ఘాటీ పోస్ట్ ప్రొడక్షన్ ఇంకా అవ్వలేదు. పనులైతే జరుగుతున్నాయి. క్రిష్ బయటికి కనిపించకపోవడానికి కారణం ఇదే. అయితే హరిహర వీరమల్లు రిలీజ్ డేట్ ఇంకా ఖరారు కాని నేపథ్యంలో రెండింటి మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండాలనేది ఘాటీ నిర్మాతల ఆలోచన. ఇంకోవైపు ఈ రెండు ప్యాన్ ఇండియా సినిమాల ఓటిటి హక్కులు అమెజాన్ ప్రైమ్ కొనుక్కుంది. థియేటర్ రిలీజ్ డేట్లు ఫైనల్ చేసే విషయంలో ప్రైమ్ షెడ్యూల్స్ కీలకం కాబోతున్నాయి. ఆ సంస్థ ప్రతినిధులతో మాట్లాడే ఘాటీ జూన్ 11 తీసుకుందనేది అంతర్గత వర్గాల సమాచారం. ఒకవేళ అదే డేట్ కి కట్టుబడితే మాత్రం వీలైనంత త్వరగా పబ్లిసిటీ మొదలుపెట్టాలి. అనుష్క ఈసారైనా బయటికి వస్తుందో లేదోననేది ఆసక్తికరంగా మారింది. యువి నిర్మిస్తున్న విశ్వంభర సైతం ఇదే తరహా డోలాయమానంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే.

# 'భూ అంటూ భూతం వస్తే.. - ఆగకే అమ్మాడీ'



శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న మూవీ 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'భూ అంటూ భూతం..'ను రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. 'భూ అంటూ భూతం..' పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. 'భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాట లాడాలి. భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాట లాడాలి..పుట్టగానే నేరుగా నువు పరుగెత్తలే, పట్టుకుంటూ పడుతూ నడకేనేర్చావే, భయపడి అడుగు ఆపకే..' అంటూ సాగుతుందీ పాట అని చిత్ర యూనిట్ తెలిపింది. నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - కేవీ గుహన్, ఎడిటింగ్ - ప్రవీణ్ పూడి, మ్యూజిక్ - అజనీష్ లోకనాథ్, నిర్మాత - దిల్ రాజు, శిరీష్, రచన -దర్శకత్వం - శ్రీరామ్ వేణు.

# పైరసీ బారిన పడితే ఇన్సూరెన్స్ వస్తుందా



ఇటీవలి కాలంలో స్టార్ హీరోల సినిమాలకు పైరసీ పెద్ద బెడదగా మారిపోయింది. రిలీజ్ రోజు మధ్యాన్నానికే మంచి హెచ్డి ప్రింట్లు రావడం పట్ల నిర్మాతలు పడుతున్న ఆందోళన అంతా ఇంతా కాదు. దీనికో పరిష్కారం కనుక్కునే దిశగా కొత్త మార్గాలు వెతుకుతున్నారు. వాటిలో ఇన్సూరెన్స్ చేయించడం గురించి బాలీవుడ్ లో చర్చలు జరుగుతున్నాయి. ముంబై మీడియా ప్రకారం సల్మాన్ ఖాన్ సికందర్ నిర్మాణ సంస్థ తమ చిత్రం పైరసీ బారిన పడటం వల్ల జరిగిన నష్టానికి గాను తొంభై కోట్ల క్లెయిమ్ ని కోరే ఆలోచనలో ఉందట. ముందు రోజు రాత్రే ఈ మూవీ తాలూకు ఒరిజినల్ వెర్షన్లు ఆన్ లైన్ లో ప్రత్యక్షమైన సంగతి తెలిసిందే. ఇది మాటల్లో చెప్పుకున్నంత సులభం కాదు. ఎందుకంటే పైరసీ ప్రమాదాన్ని ముందే గుర్తించి ఇన్సూరెన్స్ చేయించినా సదరు కంపెనీలు గుడ్డిగా సొమ్ములు చెల్లించవు. లోతైన పరిశీలన చేస్తాయి. నిర్మాత స్వంత ప్రాపర్టీ అయిన సినిమా అసలు బయటికి ఎలా వచ్చిందనే దాని మీద విచారణ కోరతారు. పోలీసుల ఇన్వెస్టిగేషన్ కు సంబంధించిన రిపోర్టులు సమర్పించాల్సి ఉంటుంది. ప్రొడక్షన్ కాస్ట్, సినిమా మీదున్న అంచనాలు, బిజినెస్ తాలూకు ఆధారాలు, బుక్ మై షో ట్రెండింగ్ గట్రా వ్యవహారాలు ఇలా రకరకాల ఆడిట్లను చేయించి ప్రొడ్యూసర్ తప్పేమి లేకుండానే డ్యామేజ్ జరిగిందని తేలితే అప్పుడు క్లెయిమ్ ఇస్తారు. ప్రస్తుతానికి సికందర్ బృందం ఇంకా ఇన్సూరెన్స్ కోసం అప్ప్లై చేయలేదు కానీ ప్రతిపాదన మాత్రం సీరియస్ గా ఉందట. ఏదైనా విపత్తు జరిగినప్పుడు కాంపెన్సేషన్ డిమాండ్ చేయడం సబబే కానీ ఇలా ఇంటి దొంగలు ఎక్కువగా ఉండే పైరసీ లాంటి సమస్యలకు పరిష్కారం అంత సులభంగా ఉండదు.

# పూరి సినిమాలో సంయుక్త

విజయ్ సేతుపతితో డైరెక్టర్ పూరి జగన్నాథ్ ఓ పాన్-ఇండియా ప్రాజెక్ట్ చిత్రీకరణను ప్రారంభించనున్నారు. హై-ఆక్టేన్ కథలకు పాపులరైన పూరి, తన సిగేచర్ మాస్, కమర్షియల్ స్టయిల్‌ని విజయ్ సేతుపతి మాగెటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో బ్లెండ్ చేసి ఒక యూనిక్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మిస్తారు. అన్ని ప్రీ-ప్రొడక్షన్ ఫార్మాలిటీలు పూర్తయ్యాయి. ఈ సినిమాలోని కీలక నటీనటులను నిర్మాతలు ఒకరి తర్వాత ఒకరిని అనౌన్స్ చేస్తున్నారు. టబు, దునియా విజరు కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడు, సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇది రెగ్యులర్ హీరోయిన్ పాత్ర కాదు. సంయుక్త పాత్ర కథనంలో కీలకంగా ఉంటుంది. ఎమోషనల్ డెప్త్, పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉండే పాత్రలో కనిపించబోతున్నారు. కథ, ఆమె పాత్రతో సంయుక్త చాలా థ్రిల్ అయ్యింది. చిత్రీకరణ స్టార్ట్ చేయడానికి ఆమె ఆసక్తిగా ఉంది అని మేకర్స్ తెలిపారు. 'వైవిధ్య కథతో తెరకెక్కబోయే ఈ సినిమాలో విజరుసేతుపతి, సంయుక్త పాత్రలు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి' అని పూరి జగన్నాథ్ చెప్పారు. ఫస్ట్ షెడ్యూల్ కోసం లొకేషన్లను ఖరారు చేయడానికి టీం ఇటీవల హైదరా బాద్, చెన్నైలలో రెక్కీని పూర్తి చేసింది. ఈనెల చివరి వారంలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది.



%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999